APTEL/26/A4269


# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి   ఎడిటర్ : సి హరికృష్ణ   బుధవారం 12 ఆగస్టు 2026   సంపుటి: 01   సంచిక :77   పేజీలు : 04   వెల: 2-00/-

## తిరుపతి ఇప్పుడు ఈ-వీసా సెంటర్..

తిరుపతి, ఆగస్టు 12: తిరుపతి విమానాశ్రయంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిదేళ్ల క్రితమే తిరుపతిని కేంద్రం అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తించినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క విదేశీ విమాన సర్వీసును ఇక్కడి నుంచి నడపలేదు. అయితే తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో త్వరలో తిరుపతి నుంచి విదేశీ ప్రయాణికుల రాకపోకలకు వీలు కల్పించనట్లుగా చెబుతున్నారు. తిరుపతి విమానాశ్రయానికి అధికారికంగా ఈ-వీసా ప్రవేశ కేంద్రం హోదాను కల్పిస్తూ తాజాగా కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఈ-వీసాలతో విదేశీయులు ప్రవేశించేందుకు వీలుగా అదనంగా 11 కొత్త కేంద్రాలను ప్రకటించగా, అందులో తిరుపతి ఎయిర్‌పోర్టును కూడా చేర్చారు. తిరుపతిని ఇ-వీసా హోల్డర్లకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రవేశ కేంద్రాల జాబితాలో చేర్చడంతో, తిరుమలను సందర్శించే విదేశీ పర్యాటకులకు ఇప్పుడు మరింత సులభమైన ప్రయాణ మార్గం లభించినట్లైందని అంటున్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చే విదేశీ భక్తులు ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు ఎయిర్ పోర్టుల్లో దిగాల్సివస్తోంది. అయితే ఇప్పుడు కేంద్రం ఇ-వీసాలు కలిగిన విదేశీయులు దేశంలోకి ప్రవేశించగల మరో 11 అంతర్జాతీయ పోర్టులను తాజాగా నోటిఫై చేయడంతో ఇకపై విదేశీ ప్రయాణికులు నేరుగా తిరుపతి ఎయిర్ పోర్టు ద్వారా దేశంలోకి ప్రవేశించే సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లైందని అంటున్నారు. కేంద్రం కొత్తగా నోటిఫై చేసిన జాబితాలో తిరుపతి, భోపాల్ విమానాశ్రయాలు ఉన్నాయి. అంతేకాకుండా తాజా నోటిఫికేషన్ తో ఇ-వీసా హోల్డర్లను దేశంలోకి అనుమతించే అంతర్జాతీయ పోర్టుల మొత్తం సంఖ్య 88కి పెరిగింది. ప్రస్తుత జాబితాలో ఇప్పుడు 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 భూమార్గ పోర్టులు ఉన్నాయి. 2014లో 43 దేశాల పౌరుల కోసం ఈ-వీసా సౌకర్యాన్ని ప్రవేశపెట్టగా, ప్రస్తుతం ఇది 172 దేశాల పౌరులకు అందుబాటులో ఉంది. దాదాపు 95 శాతం ఇ-వీసా దరఖాస్తులు 72 గంటల్లోపే విజయవంతంగా ప్రాసెస్ చేయబడుతున్నాయని ప్రభుత్వం (మిగతా 2వ పేజీలో)






## ఎర్రకోటపై మార్మోగనున్న

# వందేమాతరం!

ఢిల్లీ, ఆగస్టు 12: భారతావని 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమైన వేళ రక్షణ మంత్రిత్వ శాఖ ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈసారి ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోట ప్రాకారాలపై ఒక అత్యంత అపూర్వమైన, చారిత్రాత్మక ఘట్టం సాక్షాత్కరించబోతోంది. మన జాతీయ గేయం 'వందేమాతరం' రూపుదిద్దుకుని 150 ఏళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో, ఈ పవిత్ర గీతం తొలిసారిగా ఎర్రకోట వేదికపై నుంచి మారుమోగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. వేడుకల ప్రాంగణానికి చేరుకోగానే ఈ ఆలాపన ప్రారంభమవుతుంది. అనంతరం ప్రధాని మువ్వన్నెల జెండాను ఎగురవేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది వేడుకల్లో మరో ఆసక్తికరమైన విశేషం జెన్ జీ ప్రాతినిధ్యం. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలకపాత్ర పోషించబోతున్న నేటి యువతకు ఈసారి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. సైన్స్, మ్యాథ్స్ వంటి అంతర్జాతీయ ఒలింపియాడ్ పోటీల్లో దేశానికి పతకాలు సాధించిన 19 మంది మేధావి విద్యార్థులు నేరుగా ఎర్రకోట ప్రధాన వేదికపై ప్రధాని సమీపంలోనే ఆసీనులవుతారు. అలాగే, ఎర్రకోట ముందు భాగాన ఉండే జ్ఞాన్ పథ్ మార్గంలో 2,500 మంది ఎన్‌సీసీ అభ్యర్థులు, మైన్ కార్ప్ వాలంటీర్లు కలిసి భారీ ఆకారంలో 'వందేమాతరం' అక్షర రూప విన్యాసాన్ని ప్రదర్శించనున్నారు. వేడుకల వేళ భారత్‌కు చెందిన 'మి-17' హెలికాప్టర్ వందేమాతరం 150 ఏళ్ల గుర్తుగా ప్రత్యేక బ్యానర్‌తో నింగిలో విహరిస్తూ, అక్కడ కూర్చున్న అతిథులపై గులాబీ పూల వర్షం కురిపించనుంది. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి దాదాపు 5,000 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. వీరిలో ఇన్నోవేటర్లు, స్టార్టప్ నిర్వాహకులు, చేతివృత్తుల వారు, రైతులు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు. దేశ సంస్కృతికి అద్దం పట్టేలా 1500 మంది ఢిల్లీ వాసులు తమతమ రాష్ట్రీయ సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొననుండటం విశేషం. ఎర్రకోటలో వీఐపీ సంస్కృతికి స్వస్తి పలుకుతూ, నీటి సంరక్షణపై అవగాహన పెంచేలా ఈసారి సీటింగ్ ఎన్‌క్లోజర్లకు భారతదేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లను ఖరారు చేశారు. పర్యాటకుల సౌకర్యార్థం ఉదయం 4 గంటల నుంచే ఢిల్లీ మెట్రో సేవలు ప్రారంభమవుతాయి. ఈ-ఆహ్వాన పత్రికలు ఉన్నవారికి ఉచిత క్యూఆర్ కోడ్ ప్రయాణ సౌకర్యం కల్పించారు. వర్షం పడే అవకాశం ఉన్నందున ఎర్రకోట పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థను ముందస్తుగా పరిశీలిస్తున్నారు. వేడుక ముగిసిన వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి ప్రత్యేక స్వచ్ఛతా డ్రైవ్‌ను కూడా సిద్ధం చేశారు.





## అమిత్ షా యూటర్న్..!

### 48 గంటల్లో మారిన సీన్-విపక్షానికి కండిషన్లు..!

ఢిల్లీ, ఆగస్టు 12: నీట్ అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ను అడ్డుకునేందుకు పోలీసులు బలప్రయోగం చేసిన ఘటనపై సమాధానం చెప్పేందుకు పార్లమెంట్ కు రావాలని విపక్షాలు పదే పదే కోరుతున్నా పట్టించుకోకుండా ఉండిపోయిన హోంమంత్రి అమిత్ షా ఎట్టకేలకు అంగీకరించారు. దీంతో అమిత్ షా ఎప్పుడొస్తారని ఇవాళ కూడా విపక్షాలు కేంద్రాన్ని ప్రశ్నించాయి. అయితే పార్లమెంట్ కు రావడానికి బేషరతుగానే అంగీకరించిన అమిత్ షా 48 గంటల్లోనే యూటర్న్ తీసుకుని విపక్షానికి షరతులు పెట్టారు. పార్లమెంట్‌కు వచ్చి ఢిల్లీ విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై సమాధానం ఇచ్చేందుకు అంగీకరించిన అమిత్ షా.. నిన్న జార్ఖండ్ లో విద్యార్థుల నిరసనలు, అంతకు ముందు పంజాబ్ లో జరిగిన నిరసనలపై కూడా చర్చిద్దామంటూ విపక్షానికి షరతు పెట్టారు. తద్వారా తనను టార్గెట్ చేస్తున్న విపక్షాలను .. వారు అధికారంలో ఉన్న పంజాబ్ (ఆప్), జార్ఖండ్ (కాంగ్రెస్-జేఎంఎం)లో నిరసనలపై ఇరుకునపెట్టేందుకు ప్లాన్ చేశారు. దీంతో విపక్షాలు అమిత్ షా షరతుక అంగీకరిస్తాయా, వారు అంగీకరించకపోతే అదే కారణం చూపి మరో రెండు రోజుల్లో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలకు ఆయన రాకుండా ఉండిపోతారా అన్న చర్చ జరుగుతోంది. అమిత్ షా స్పందించే ముందు ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాలని ప్రభుత్వం ప్రతిపక్షానికి తెలిపింది. కేవలం ఒక ప్రకటన చేయడం అనేది ఒక లాంఛనప్రాయమైన చర్య మాత్రమే అవుతుందని, తమకు కావాల్సింది కేవలం ప్రకటన కాదని, సమగ్ర చర్చ అని ప్రభుత్వ వర్గాలు ఇవాళ పేర్కొన్నాయి. మరోవైపు ఇప్పటికే కల్పిత చర్చల పట్ల తనకు ఆసక్తి లేదని విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పేర్కొన్నారు. నేరుగా జూలై 20న విద్యార్థులపై కాల్పులు జరపాలని ఎవరు ఆదేశించారో పార్లమెంటుకు తెలియజేయాలని హోం మంత్రిని ప్రత్యేకంగా కోరారు. అమిత్ షా వచ్చి పార్లమెంటులో ప్రసంగిస్తారా అనేది అసలు ప్రశ్న కాదు. ఢిల్లీలో కాల్పులకు ఎవరు అనుమతి ఇచ్చారో అమిత్ షా స్పష్టం చేయాలన్నదే అసలు ప్రశ్న అని రాహుల్ స్పష్టం చేశారు. దీన్ని బట్టి చూస్తుంటే అమిత్ షా రావడం, విపక్షం కోరుతున్నట్లుగా సమాధానం చెప్పడం సాధ్యం కాదని తేలిపోతోంది.

## సీడ్ యాక్సెస్ రోడ్డుపై హైకోర్టు కీలక ఆదేశాలు..!




అమరావతి , ఆగస్టు 12: అమరావతి రాజధాని నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న కూటమి సర్కార్ కు ఇవాళ మరో గుడ్ న్యూస్ అందింది. రాజధానిలోని అన్ని ప్రాంతాల్ని కనెక్ట్ చేసే విధంగా ప్రభుత్వం నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి చేపట్టిన భూసేకరణలో కొన్ని చోట్ల రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మెరుగైన ప్యాకేజీ ఇస్తామన్నా రైతులు అంగీకరించలేదు. ప్రభుత్వ ఆదేశాలపై సదరు రైతులు హైకోర్టుకు వెళ్లారు. అయితే వారి పిటిషన్లు విచారించిన హైకోర్టు.. ఇవాళ కీలక తీర్పు ఇచ్చింది. అమరావతిలో భూసేకరణ కోసం ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం రాజధానికి అవసరమైన భూముల్ని భూసమీకరణ లేదా సేకరణ విధానంలో ప్రభుత్వం తీసుకుంటుంది. ఎక్కువగా స్థానికులు భూసమీకరణకు అంగీకరించి తమ భూముల్ని ప్రభుత్వానికి ఇచ్చారు. దీంతో మెజార్టీ భాగం సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అయితే మధ్యలో కొందరు రైతులు మాత్రం తమ భూములు ఇవ్వకపోవడంతో ఈ రోడ్డు మీద నుంచి రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా పోయింది. దీనిపై ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా సదరు రైతులు మాత్రం భూములివ్వకుండా కోర్టుకు వెళ్లారు. వీరి పిటిషన్లు విచారించిన హైకోర్టు వాటిని తోసిపుచ్చింది.



## అంబులెన్సులకు మహిళా డ్రైవర్లు..

పల్నాడు, ఆగస్టు 12: మహిళలకు ఉద్యోగావకాశాలు, ఆర్థిక స్వావలంబన కల్పించడంలో భాగంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు మహిళా డ్రైవర్లను నియమించే దిశగా చర్యలు చేపడుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లోనూ సమర్థంగా పనిచేస్తున్నారని.. డ్రైవింగ్ కూడా వారికి సాధ్యమేనని చెప్పారు. 102 వాహనాల నిర్వహణ సంస్థ.. కన్సార్టియం ఆఫ్ విద్యా వేదా ఫౌండేషన్ అండ్ శ్రీనివాసా టూర్స్ అండ్ ట్రావెల్స్ మహిళా డ్రైవర్ల నియామకానికి ప్రతిపాదన చేసిందని.. ప్రభుత్వం దీనిపై సానుకూలంగా ఉందన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట లోని ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం 102 ఆధునిక (మిగతా 2వ పేజీలో)

## తిరుపతి ఇప్పుడు ఈ-వీసా సెంటర్..

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. ఆమోదించబడిన ప్రవేశ మార్గాల జాబితాలో ఇప్పుడు తిరుపతి కూడా చేరడంతో, సమీప భవిష్యత్తులో విదేశాల నుంచి నేరుగా తిరుపతికి విమానాలు నడిచే అవకాశాలు బలపడుతున్నాయి. రాష్ట్రంలో విమానయాన కనెక్టివిటీని మరింత పెంచేందుకు, పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలలో ఈ నిర్ణయం ఒక కీలకమైన ముందుడుగుగా నిపుణులు భావిస్తున్నారు. చెల్లుబాటు అయ్యే ఈ-వీసాలు కలిగిన విదేశీ సందర్శకులకు భారతదేశంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక గమ్యస్థానాలలో ఒకటైన తిరుపతిని చేరుకోవడానికి ఈ పరిణామం అద్భుతమైన మార్గాన్ని సుగమం చేసిందని అంటున్నారు. ఇంతవరకు విదేశాల నుంచి వచ్చే యాత్రికులు నేరుగా తిరుపతికి రావడానికి అవకాశం ఉండేది కాదు. విదేశీ ప్రయాణికులు ముందుగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాలలో దిగి, అక్కడి నుంచి రోడ్డు లేదా రైలు మార్గం ద్వారా తిరుపతికి చేరుకోవాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో విదేశీ భక్తులు నేరుగా చెల్లుబాటయ్యే ఈ-వీసాతో తిరుపతి విమానాశ్రయం ద్వారా దేశంలోకి ప్రవేశించడానికి మార్గం సుగమమైంది. త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తే ఈ ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుందని చెబుతున్నారు. తిరుపతి విమానాశ్రయానికి 2008లోనే అంతర్జాతీయ హోదా లభించినప్పటికీ, 2017లో దీనిని అధికారికంగా నోటిఫై చేశారు. విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చి సుమారు 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఒక్క రెగ్యులర్ అంతర్జాతీయ విమానం కూడా ఇక్కడ ల్యాండ్ కాలేదు. ఈ నేపథ్యంలో తాజా ఈ-వీసా ఆమోదం రావడం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది.



## హైదరాబాద్ మెట్రోకు బిగ్ బూస్ట్ ఇచ్చిన సీఎం రేవంత్!

హైదరాబాద్ , ఆగస్టు 12: హైదరాబాద్ మెట్రోను పురోగతి మార్గంలో నడపాలని, మెట్రో సేవలతో ప్రజల రవాణా అవసరాలను తీర్చాలని, తద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు వెయ్యాలని తెలంగాణా ప్రభుత్వం సంకల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో తాజాగా హైదరాబాద్ మెట్రో విస్తరణలో ముఖ్యమైన అడుగు వేసింది తెలంగాణా సర్కార్. పాతబస్తీ మెట్రో కారిడార్ పనులను వేగవంతం చేయాలని ఆదేశం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పాతబస్తీ మెట్రో కారిడార్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేడు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ మార్గానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, రోడ్డు విస్తరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియలను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాతబస్తీ ప్రాంతానికి మెట్రో సేవలు అందుబాటులోకి వస్తే అక్కడి ప్రజలకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని సీఎం పేర్కొన్నారు. మెట్రో రైళ్లకు కొత్త కోచ్‌లు జత చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించి అవసరమైన సాంకేతిక సలహాలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణం, నిర్వహణ, ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మరోవైపు ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో మెట్రో రైళ్లకు కొత్త కోచ్‌లు జత చేయాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుత సామర్థ్యానికి అదనంగా కొత్త కోచ్‌లను కొనుగోలు చేసి రైళ్లకు జోడించాలని అధికారులను ఆదేశించారు. పీక్ అవర్స్‌లో రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ చర్య కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.ఈ నిర్ణయాలతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 పనులు వేగం పుంజుకునే అవకాశం ఉంది. పాతబస్తీ కారిడార్ పూర్తయితే నగరంలోని ముఖ్య ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడి, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.



## 74 లక్షల ఓట్లు ఫట్!

హైదరాబాద్,ఆగస్టు12: తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పిటిషన్(సర్) ప్రక్రియ సోమవారం ముగిసింది. ముసాయిదా జాబితాను రెండు రోజుల్లో విడుదల చేయనున్నారు. అయితే.. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి ఇచ్చిన వారితో పోల్చుకుంటే.. దాదాపు 74 లక్షల మంది తిరిగి ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో వీరి ఓట్లు ముసాయిదా జాబితా నుంచి పూర్తిగా తొలిగిపోయినట్టేనని తెలిపారు. అయితే.. వీరిలో శాస్వత నివాసం లేని వారు... వలస పోయినవారు, మృతి చెందిన వారే ఎక్కువగా ఉండి ఉంటారని భావిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా డిజిటలైజేషన్ చేసినట్టు రాష్ట్ర ఎన్నికల అధికారులు తెలిపారు. వీటికి సంబంధించిన ముసాయిదా జాబితాను పోలింగ్ బూత్‌ల వారీగా ఈ నెల 17న విడుదల చేయనున్నారు. అయితే.. దీనికి ముందే.. రాష్ట్ర ఎన్నికల అధికారులు కీలక ప్రకటన చేసేందుకు రెడీ అయ్యారు. ముఖ్యంగా 74 లక్షల మేరకు ఓట్లు గల్లంతు కావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై వివరణ ఇచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా చూసుకుంటే హైదరాబాద్‌లోనే ఎక్కువ మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వనట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో హైదరాబాద్ జిల్లాలోనే ఎక్కువగా ఓట్లు పోయే అవకాశం కనిపిస్తోందని అంచనా వేశారు. ఇదిలావుంటే.. ఇప్పటికే -సర్- ప్రక్రియను తెలంగాణలో రెండు సార్లు పొడిగించారు. అయినా.. ఎన్యూమరేషన్ ఫారాలు చాలా మటుకు వెనక్కి రాకపోవడం గమనార్హం. దీంతో ఆయా ఓట్లు ఇక లేనట్టేనని చెబుతున్నారు.

# అంబులెన్సులకు మహిళా డ్రైవర్లు..

(మొదటి పేజీ తరువాయి)

అంబులెన్స్ ల సేవలను ప్రారంభించి, మంత్రి మాట్లాడారు. 102.. 104.. 108.. ఒకే లక్ష్యం గర్భధారణ నుంచి ప్రసవం వరకు 102, అత్యవసర పరిస్థితుల్లో 108, గ్రామస్థాయిలో పరీక్షలు, చికిత్సలకు 104 సేవలను అనుసంధానిస్తూ సమగ్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం తగ్గించి.. అవసరమైన సేవలను వీలైనంత వరకు వారి వద్దకే తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తల్లీబిడ్డలకు మరింత భరోసా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రసవం అనంతరం ఆసుపత్రి నుంచి ఇంటికి చేర్చడానికే పరిమితం చేయకుండా గర్భధారణ దశ నుంచే విస్తరిస్తున్నామని మంత్రి తెలిపారు. యాంటీనాటల్ చెకప్‌లకు వెళ్లే గర్భిణులు 102 సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను ఆసుపత్రికి తరలించడంతోపాటు రక్తహీనతతో బాధపడే గర్భిణులకు అవసరమైన చికిత్స అందేలా సేవలను విస్తరిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 కొత్త 102 వాహనాలు అందుబాటులోకి తెస్తున్నామని.. తొలి విడతలో 300, మరో రెండు నెలల్లో 200 వాహనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వాహనాల్లో ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగులు, ఫుట్‌రెస్ట్, జీపీఎస్ ట్రాకింగ్, అత్యవసర ఎస్‌వీఎస్ బటన్ వంటి సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ నరసరావుపేటలో 50 వాహనాలు ప్రారంభించారు. దీనికి అనుగుణంగా ప్రతి జిల్లాల్లోనూ 300 అంబులెన్సుల సేవలను అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రారంభం అయ్యాయి. అత్యవసర వైద్య సేవల్లో 108ను బలోపేతం చేశామని మంత్రి తెలిపారు. అంబులెన్సుల సంఖ్యను 602 నుంచి 733కు పెంచామని.. సుమారు 170 అధునాతన జీవనాధార సదుపాయాలున్న వాహనాలు ఉన్నాయని చెప్పారు. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అంబులెన్స్ చేరే సమయాన్ని కూడా తగ్గించామని తెలిపారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా గ్రామాల్లోనే 41






రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించేలా సేవలను విస్తరిస్తున్నామని చెప్పారు. పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి వైద్య సేవలను అందించేలా సంజీవని వేదికను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య, నర్సింగ్, పారామెడికల్ తదితర విభాగాల్లో సుమారు 12 వేల నియామకాలు చేపట్టామని మంత్రి తెలిపారు. సిబ్బంది అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ, ఐపీ సేవలు పెరిగాయని చెప్పారు. నరసరావుపేట ఆసుపత్రిలో మేజర్ సర్జరీలు 3,248 నుంచి 4,321కు, ఎక్స్‌రేలు 14 వేల నుంచి 15,450కు, ఈసీజీలు 5,832 నుంచి 6,900కు పెరిగాయని వివరించారు.

# ఏపీ ఫర్ సేల్.. అమ్మకానికి ఆంధ్రప్రదేశ్: మాజీమంత్రి సంచలనం!

ఆంధ్రప్రదేశ్, ఆగస్టు 12: ఆంధ్రప్రదేశ్‌ను అమ్మకానికి పెట్టే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని మాజీమంత్రి కురసా కన్నబాబు చంద్రబాబును టార్గెట్ చేశారు. ఏపీ ఫర్ సేల్.. అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ అన్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. ప్రజల పక్షాన నిలబడి పరిపాలన చేయాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ల పక్షాన నిలబడి రాష్ట్ర వనరులు, సంపదను ప్రైవేట్ సంస్థలకు దోచిపెట్టే కార్యక్రమం చేస్తోందన్నారు. చంద్రబాబు చెప్పిన సంపద సృష్టి ప్రజల కోసం కాదు.. కార్పొరేట్ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, తన మద్దతుదారుల కోసం అని ఇప్పుడు స్పష్టమైందన్నారు. తరతరాలకు నష్టం చేసే కొత్త స్కామ్‌కు ఈ ప్రభుత్వం తెర తీసిందన్నారు. కొత్త పీపీపీ 2026 విధానం సుమారు రూ.1.23లక్షల కోట్ల పెట్టుబడులు పీపీపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం చెబుతోందన్నారు. 2026-27లో పెట్టుబడిదారులకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద రూ.1,500కోట్లు ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. ప్రభుత్వ ఆస్తులు, వనరులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి.. వాటిపై ప్రజలనుంచే యూజర్ చార్జీలు వసూలు చేసే ద్వారాలు తెరిచారని మండిపడ్డారు. రోడ్లు, పోర్టులు, విద్య, వైద్యం, తాగునీరు, మురుగునీటి పారుదల, సాగునీరు, పబ్లిక్ భవనాలు, హౌసింగ్, టూరిజం, డేటా సెంటర్లు, పార్కులు



వంటి అన్ని రంగాలను పీపీపీ కింద ప్రైవేట్‌కు అప్పగించే కార్యక్రమం జరుగుతోందని, పీపీపీకి ఇవ్వకుండా ప్రభుత్వం మిగిల్చిన రంగం ఏదైనా ఉందా? అన్నారు. పీపీపీ విధానం పేరుతో ప్రభుత్వ వైద్య రంగాన్ని ప్రైవేట్‌కు ఇచ్చే కుట్ర జగన్ ప్రభుత్వం నిర్మించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూడా ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నించారన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ ప్రయత్నం వెనక్కి వెళ్లిందన్నారు. ఇప్పుడు మళ్లీ పీపీపీ విధానం పేరుతో ప్రభుత్వ వైద్య రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ పరం చేస్తున్నారు. రోడ్లను ప్రైవేట్‌కు అప్పగించి టోల్ వసూలు చేసే విధానాన్ని తీసుకొస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డు, కొత్త పెన్షన్, కొత్త ఇల్లు, కొత్త ఇంటి స్థలం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం విఫలమవుతోందని మాజీ మంత్రి కన్నబాబు అన్నారు. మరోవైపు ప్రైవేట్ సంస్థలకు వేలాది ఎకరాల భూములు, రాయితీలు ఇస్తోందన్నారు. ప్రజలపై పన్నులు, చార్జీలు పెంచుతూ.. ప్రైవేట్ సంస్థలకు మాత్రం భూములు, నీరు, విద్యుత్, రాయితీలు, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం ఏ విధమైన ప్రజా పాలన? అని ప్రశ్నించారు. పీపీపీ -2026 విధానంపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలన్నారు. ప్రజా ఆస్తులను, రాష్ట్ర వనరులను ప్రైవేట్‌కు అప్పగించే ఈ విధానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంగా ప్రజల తరపున గట్టిగా పోరాడుతామన్నారు. పీపీపీ- 2026 విధానం ప్రజాహితం కాదు. ప్రజా ప్రయోజనానికి విరుద్ధమైన ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలి ంచాలి లేదా ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు.

# మళ్లీ డోప్ టెస్ట్ ఫెయిలైన పైలట్- గాల్లో దీపంలా ప్రాణాలు..!

ఈ నెల 4వ తేదీన ఫుకెట్ నుంచి న్యూఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానం మార్గ మధ్యలో ఉన్నట్లుండి 300 అడుగుల కిందకు జారిపోవడంతో ఇందులో ప్రయాణికులతో పాటు సిబ్బందికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఎయిరిండియా విమానాల భద్రతపై తీవ్ర అనుమానాలు రేకెత్తించింది. మొదట్లో దీన్ని గాల్లో ఎదురైన సమస్యగా భావించారు. కానీ ఆ తర్వాత పైలట్ తప్పిదంగా నిర్ధారించారు. సాంకేతిక సమస్యలు కూడా కారణమని కూడా చెప్తున్నారు. దీంతో పైలట్ కు డోప్ టెస్టులు నిర్వహించారు. ఇందులో తొలిసారి నిర్వహించిన టెస్టులో పాజిటివ్ గా తేలిన పైలట్ .. తాజాగా నిర్వహించిన రెండో టెస్టులోనూ దోషిగా తేలాడు. ఫుకెట్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమాన ఘటన నేపథ్యంలో పైలట్ కు నిర్వహించిన ప్రాథమిక డోప్ పరీక్షల్లో స్క్రీనింగ్ ఫలితాలకు మరింత విశ్లేషణ అవసరమని తేలింది. దీంతో మరోసారి డోప్ టెస్టుల నిర్వహణకు ఆగస్టు 9న పౌర విమానయానశాఖ ఆదేశాలు ఇచ్చింది. దీంతో సదరు పైలట్ కు మరోసారి డోప్ టెస్టు నిర్వహించారు. ఇందులోనూ అతను పాజిటివ్ గా తేలినట్లు టైమ్స్ నౌ కథనం వెల్లడించింది. ఈ ఘటనలో నలుగురు క్యాబిన్ సిబ్బందితో సహా కనీసం 17 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో విచారణ జరుపుతోంది. మరోవైపు ఈ ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపాలు కూడా బట్టబయలయ్యాయి. విమానంలో అనేక సాంకేతిక లోపాలు, హైడ్రాలిక్ వైఫల్యాలు, కుదుపులు కూడా తలెత్తాయని దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఆగస్టు 4న జరిగిన విమాన ప్రయాణంలో, ఆటో-పైలట్ మోడ్ డిస్‌కనెక్ట్ కావడంతో సహా విమానంలో అనేక లోపాలు తలెత్తాయని తెలుస్తోంది. విమానం కో-పైలట్ మాన్యువల్‌గా నియంత్రణను తిరిగి పొందిన



వెంటనే, ఫ్లైట్ కంట్రోల్ స్టాల్ సందేశం వచ్చింది. పలు స్విచ్‌లు కొద్దిసేపు ఆగిపోయాయని, అనేక సాంకేతిక, యాంత్రిక లోపాలు తలెత్తాయని అధికారులు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించిన తర్వాత, ఆ విమానం ఢిల్లీకి బయలుదేరింది. మరోవైపు ఈ ఘటనపై ఆగ్రహంగా ఉన్న కేంద్రం.. ఎయిర్ ఇండియా సీఈవో పదవి నుంచి తప్పుకుంటున్న క్యాంప్ బెల్ విల్సన్ ను విచారణకు హాజరు కావాలని సమన్లు పంపింది.

# పాకిస్థాన్‌కు సౌదీ షాక్.. భారత్‌పై యుద్ధానికి నో!

పాకిస్థాన్, టర్కీ, సౌదీ అరేబియాల మధ్య కుదిరిన మక్కా రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్ ఆగ్రహంతో ఉండగా.. పాకిస్థానీలు ఆనందంతో ఉన్నారు. "ముస్లిం నాటో"గా పిలవబడుతున్న ఈ రక్షణ ఒప్పందాన్ని సౌదీ అరేబియా నుంచి పాకిస్థాన్ వరకు ఘనంగా జరుపుకుంటున్నారు. ఒకవేళ భారత్ పాకిస్థాన్‌పై దాడి చేస్తే సౌదీ అరేబియా, టర్కీ రెండూ దానికి సహాయం చేస్తాయని పాకిస్థానీలు సంతోషిస్తున్నారు. ఈ రక్షణ ఒప్పందం ప్రకారం ఓ దేశంపై దాడిని మరో దేశంపై దాడిగా పరిగణిస్తారు. మక్కా రక్షణ ఒప్పందం పాకిస్థాన్ దౌత్య స్థానాన్ని గణనీయంగా బలోపేతం చేసిందనడంలో సందేహం లేదని, భవిష్యత్తులో దాని సైనిక బలాన్ని కూడా గణనీయంగా పెంచుతుందని నిపుణులు అంటున్నారు. భారత్ గురించి సౌదీ అరేబియా నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం. భారత్, సౌదీ అరేబియాల మధ్య చాలాకాలంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. వేలాది మంది భారతీయులు సౌదీ అరేబియాలో పనిచేస్తున్నారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పలుమార్లు భారత్‌ను సందర్శించారు. మిల్లీ క్రానికల్ నివేదిక ప్రకారం.. పాకిస్థాన్‌తో రక్షణ ఒప్పందం కుదిరినంత మాత్రాన భవిష్యత్తులో భారత్‌తో ఘర్షణ పడటానికి సౌదీ అరేబియా లేదా టర్కీ నుంచి పాకిస్తాన్‌కు పూర్తి స్వేచ్ఛ లభించినట్లు కాదని సౌదీ నిపుణులు అంటున్నారు. సౌదీ అరేబియా నుంచి వచ్చిన ప్రకటనలు చాలా సంయమనంతో కూడుకున్నవి. అంతేకాకుండా, సౌదీ నిపుణులు భారత్ వ్యతిరేక వాదనను తిరస్కరిస్తున్నారు. మక్కా ఒప్పందాన్ని ఇండియాకు వ్యతిరేకంగా చేసుకున్న



దురాక్రమణ ఒప్పందంగా చూడాలన్న వాదనను సౌదీ అరేబియా నిపుణుడు బదూర్ సోషల్ మీడియాలో కొట్టిపారేశారు. "సౌదీ అరేబియాకు భారత్, గ్రీస్‌లతో బలమైన వ్యూహాత్మక స్నేహం ఉంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఉన్నత స్థాయి దౌత్యం ద్వారా భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో సౌదీ అరేబియా కీలక పాత్ర పోషించింది, ఇది తదనంతరం కాల్పుల విరమణకు దోహదపడింది." అని పేర్కొన్నారు. మక్కా రక్షణ ఒప్పందం పూర్తిగా రక్షణాత్మకమైన దని, ఏ దేశానికీ వ్యతిరేకంగా నిర్దేశించబడలేదని కూడా బదూర్ పేర్కొన్నారు. అందువల్ల ఇది దాడి చేయడానికి చేసుకున్న ఒప్పందం అనే వాదన అర్థరహితమన్నారు. ఈ మూడు దేశాలలో ఏదైనా ఒకదానిపై శత్రువు దాడి చేస్తేనే ఇది అమల్లోకి వస్తుంది. లేకపోతే ఇది శాంతి, స్థిరత్వాన్ని మాత్రమే ప్రోత్సహిస్తుంది. దీనిని యావత్ ప్రపంచం గుర్తించాలి. బదూర్ ప్రకటన సౌదీ అరేబియా ప్రభుత్వానిది కానప్పటికీ.. సౌదీ అరేబియాలో ఈ ఒప్పందాన్ని కేవలం భారతదేశ వ్యతిరేక ఒప్పందంగా మాత్రమే చూడటం లేదని ఇది చూపిస్తోంది.

అనంత సూర్య తెలుగువార్త

బుధవారం 12 ఆగస్టు 2026

# పతంజలి యోగ సమితి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా రాజయోగి భాస్కర్ నాయుడు ఎంపిక



కొత్తచెరువు,ఆగష్టు 11, అనంత సూర్య న్యూస్:శ్రీ సత్యసాయి జిల్లా పతంజలి యోగ సమితి మరియు భారత్ స్వాభిమాన్ సంస్థల శ్రీ సత్య సాయిజిల్లా అధ్యక్షుడిగా (ఇన్ఛార్జి) కొత్తచెరువు పట్టణానికి చెందిన ప్రముఖ యోగాచార్యులు, సామాజిక వేత్త రాజయోగి భాస్కర్ నాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు పతంజలి - భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు మంగయ్య ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా అనంతపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతంజలి - భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ప్రతినిధులు కోదండ రామమూర్తి, ఉమాకాంత్,మాస్టర్ మురళీకృష్ణ,శివరామ శర్మ , మాస్టర్ రవిప్రసాద్ భారత స్వాభిమాన్ అధ్యక్షులు అనంతపురం చేతుల మీదుగా భాస్కర్ నాయుడు ఈ నియామక పత్రాన్ని అందుకున్నారు. ముఖ్యమైన విషయాలు మరియు భవిష్యత్ కార్యాచరణ,.. 30 ఏళ్ల నిరంతర సేవకు గుర్తింపు.. గత మూడు దశాబ్దాలుగా విద్యా, సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశేష సేవలు అందిస్తూ లక్షలాది మంది విద్యార్థులలో చైతన్యం నింపి, వారిని జ్ఞానవంతులుగా, శక్తివంతులుగా తీర్చిదిద్దిన భాస్కర్ నాయుడి సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించారు. గ్రామ సా-ధ్యికి యోగా సేవలు: జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ యోగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి భావి భారత పౌరులతో పాటు మహిళలకు, వృద్ధులకు ఆరోగ్యం, ఆనందం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సంస్థ నాయకులు పిలుపునిచ్చారు. అన్ని వ్యాధులకు యోగాతో పరిష్కారం: బీపీ,షుగర్,గ్యాస్ట్రిక్ వంటి ఆధునిక జీవనశైలి వల్ల వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రాణాయామం, యోగాసనాల ద్వారా సహజసిద్ధమైన ఉపశమనం అందించే కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా విస్తృతం చేయనున్నారు. సమాజంలో ఆరోగ్య చైతన్యం: యోగాను కేవలం వ్యాయామంగా కాకుండా, ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగంగా మార్చి "ఆరోగ్యకరమైన మరియు శారీరక దార్శనికత కలిగిన సమాజం" నిర్మాణానికి కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా రాజయోగి భాస్కర్ నాయుడు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పతంజలి- భారత స్వాభిమాన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పూజ్య స్వామి రాందేవ్ మహారాజ్ కు, దక్షిణ భారత ఇంచార్జ్ స్వామి రితిదేవ్ గుర్జీకి మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ భాస్కర్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహణ

కొత్తచెరువు,ఆగష్టు 11, అనంత సూర్య న్యూస్:ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కొత్తచెరువు నందు మంగళవారం విద్యా శాఖ మరియు శిశు సంక్షేమ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తచెరువు మండల అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఐ సి డి యస్ ప్రాజెక్ట్ పుట్టపర్తి సీడీపీఓ జయంతి, కొత్తచెరువు మండల యంఈవో చంద్రశేఖర్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఫండేషనల్ లీటరసీ అండ్ న్యూమరసి 120 డేస్ లో భాగంగా ఈ మూడు రోజుల శిక్షణ అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించడం జరుగుతుందని,ఈ శిక్షణలో అంగన్వాడీ కార్యకర్తలు ప్రారంభ తరగతులలో ఆటల ఆధారిత అభ్యసన,పిల్లల అభ్యసనలో తల్లిదండ్రులు మరియు సమాజ భాగస్వామ్యం,ప్రారంభ సంవత్సరాలలో అంచనాలు,అంగన్వాడీ కేంద్రాలలో సమ్మిళిత పద్ధతులు మరియు సంరక్షణ అనే అంశాల గురించి నేర్చుకుంటారని తెలిపారు. అనంతరం యంఈవో మాట్లాడుతూ అంగన్వాడీ స్థాయి నుండే పిల్లలకు మంచి పునాది వేసినట్టు అయితే భవిష్యత్తులో బడికి రాకుండా ఉండడాన్ని తగ్గించవచ్చుని,పిల్లలు మంచి తెలివితేటలు కలిగి చదువులో రాణిస్తారు అని తెలిపారు. ఈ ట్రైనింగ్ ని ఉపయోగించుకుని అంగన్వాడీ కార్యకర్తలు తమ



యొక్క నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని పిల్లలు సమగ్ర అభివృద్ధి కి పునాది వేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైసర్ సుజాతమ్మ, ఉపాధ్యాయులు శివయ్య,ఈశ్వరప్ప, చంద్రశేఖర్,మండల స్థాయి అంగన్వాడీ కార్యకర్తలు షర్మిల, నాగవేణి,ఉషారాణి, సుబ్బమ్మ,సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని సమాజంలో ముందంజలో నిలవాలి




**• రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత-జౌళి శాఖ మంత్రి సవిత,జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి**

**• శ్రీ సత్యసాయి జిల్లాలో 'బాలికే భవిష్యత్తు'వినూత్న కార్యక్రమం ఘనంగా నిర్వహణ**

పుట్టపర్తి,ఆగస్టు,11, అనంత సూర్య న్యూస్:బాలికల విద్యాభివృద్ధి, సాధికారతే ధ్యేయంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ దిశానిర్దేశంలో, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి సమీపంలోని మామిళ్లకుంట క్రాస్ వద్ద "బాలికే భవిష్యత్తు" వినూత్న కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ప్రేరణాత్మక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 1400 మంది బాలికలు, ఉపాధ్యాయులు విశేషంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు చేనేత-జౌళి శాఖ మంత్రి సవిత,పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి,పద్మశ్రీ మరియూ అర్జున అవార్డు గ్రహీత,ప్రముఖ అథ్లెట్ మాలతి పాల్గొన్నారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు ఒకే ఒక లక్ష్యంపై దృష్టి సారించి, సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్. సవిత పిలుపునిచ్చారు. మన దేశంలో పూర్వకాలం నుండి నేటి వరకు మహిళలు అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలుస్తున్నారని,మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్లే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ,ఉచిత బస్సు ప్రయాణం,'తల్లికి వందనం' వంటి పథకాలు మరియు స్థానిక సంస్థల నుండి రాజ్యాంగ పదవుల వరకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలను అడ్డుకోవడం అందరి సమిష్టి బాధ్యత అని, ఎక్కడైనా బాల్య వివాహాల యత్నాలు జరిగితే వెనువెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్కు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని,చదువుకునే వయస్సులో ఇతర వ్యాపకాలకు లోనుకాకుండా ఉజ్జ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు ఎట్టిపరిస్థితుల్లోనూ చదువును మధ్యలోనే ఆపకుండా కనీసం డిగ్రీ పూర్తయ్యే వరకు ఉన్నత విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో పదో తరగతి వరకు బాలికల ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆ తర్వాత డ్రాపౌట్ శాతం పెరుగుతుండటం, బాల్యవివాహాలు,టీనేజ్ ప్రెగ్నెన్సీలు నమోదు కావడం ఆందోళనకరమన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 156 బాల్యవివాహాలను ఐసీడీఎస్,స్వచ్ఛంద సంస్థల సహకారంతో అడ్డుకున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, సోషల్ మీడియా,స్క్రీన్లకు లొంగిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అత్యవసర సమయాల్లో 112 టోల్ ఫ్రీ నంబర్ను ఉపయోగించుకోవాలని, ప్రతి సబ్డివిజన్లో ఐసీడీఎస్,జుడీషియరీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. బాలికల రక్షణకు,వారి భవిష్యత్తుకు జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖ పూర్తి సా-ధ్యిలో అండగా ఉంటాయని తెలిపారు. పుట్టపర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యత ఢ స్ఫూర్తి భారతీయ సంస్కృతిలో ప్రాచీన కాలం నుండి మహిళలకు ఉన్నత స్థానం ఉంది. మహిళలు మరియు పురుషులు దేవుని సృష్టిలో ప్రత్యేకమైనవారు, ఒకరితో ఒకరికి పోటీ కాకుండా తమ ప్రతిభతో ముందుకు సాగాలి. ప్రతి మహిళ కూతురిగా, స్నేహితురాలిగా, కోడలిగా,తల్లిగా అనేక బాధ్యతలు నిర్వహిస్తోంది. సమాజంలో తమని తాము సమానంగా భావించి స్వీయ గౌరవాన్ని కాపాడుకోవాలి. విజయానికి మూడు సూత్రాలుగొప్పగా కలలు కనండి. లక్ష్యం పెద్దదిగా ఉంటేనే దాన్ని సాధించాలనే తపన పెరుగుతుంది. కష్టపడి పనిచేయండి, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎదురయ్యే ఆటంకాలను దాటుకుంటూ నిలకడగా శ్రమించాలి. సమాజంలో మార్పు కోసం ఎదురుచూడకుండా, మీరే ఆ మార్పు దిశగా అడుగులు వేయాలి. ప్రముఖ మహిళల ఉదాహరణలు మీరా కుమార్ (మొదటి మహిళా లోక్సభ స్పీకర్),కిరణ్ బేడీ (మొదటి మహిళా ఐపియస్ అధికారిణి), ఆనందీ గోపాల్ జోషి (మొదటి మహిళా డాక్టర్ -1930ల కాలంలోనే యు యస్ వెళ్లి చదువుకున్నారు) వంటి ఎంతో మంది మహిళలు కష్టాలను ఎదుర్కొని చరిత్ర సృష్టించారు. చదువుతో పాటు సొంత ఆరోగ్య సంరక్షణ చాలా ముఖ్యం. మానసిక ప్రశాంతత కోసం ఏదైనా మంచి వ్యాపకం (పుస్తకాలు చదవడం,సింగింగ్, డ్యాన్సింగ్, పెయింటింగ్) అలవాటు చేసుకోవాలి. 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగడం చాలా ముఖ్యం. తల్లిదండ్రులను చూసుకునే బాధ్యతను మహిళలు కూడా సమానంగా స్వీకరించాలి. ఈ కార్యక్రమంలో పిడి ఐసిడిఎస్ ప్రమీల,డిఈఓ క్రిస్టప్ప,నరసయ్య పిడి డిఆర్డిఏ,ఫైరోజా బేగం డిఎండహెచ్ఓ,డిస్టిక్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేంద్ర కుమార్ రెడ్డి, డిసిపిఓ మహేష్ ఐసిడిఎస్ సిబ్బంది సిబ్బంది ఓఎస్సీ సిబ్బంది,చైల్డ్ లైన్ సిబ్బంది 1400 బాలికలు మరియు ఆ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని కలిసిన రఘువీరారెడ్డి

మడకశిర,ఆగస్టు 11 అనంత సూర్య న్యూస్:కాంగ్రెస్ పార్టీ నాయకుడు,లోక్ సభ విపక్షనేత రాహుల్ గాంధీని కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి కలిశారు. ఢిల్లీ లోని పార్లమెంట్ లో రాహుల్ జీని రఘువీరా మర్యాద పూర్వకంగా కలసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు



అంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రస్తుత తాజా రాజకీయ పరిస్థితులు పట్ల చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెల్సింది. అదేవిధంగా ఏఐసీసీ అధ్యక్షులు,రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జునఖర్గే ను కూడా రఘువీరారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేసారు. వివిధ సమస్యలను ఖర్గే దృష్టికి తీసుకెళ్లి వివరించి వాటి పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ముదిగుబ్బ,ఆగస్టు11, అనంత సూర్య న్యూస్:ముదిగుబ్బ మండలంలోని ఎన్ హెచ్ 42 జాతీయ రహదారి మలక వేముల సమీపాన అనంతపురం రోడ్డు పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పెంకుల రైల్వే గేట్ వద్ద ఫైఓవర్ బ్రిడ్జి కింద గుర్తుతెలియని వయసు మళ్ళిన బహుదూరపు బాటసారి వ్యక్తి మృతి విషయం తెలియగానే పట్నం పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహమ్మద్ హర్షద్,సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మతిస్థిమితం లేని వ్యక్తిగా కనిపిస్తున్నాడని గుర్తించారు మృతునికి పొడవైన గడ్డం పొడవైన తల వెంట్రుకలు ఉండి చాలాకాలంగా శుభ్రత లేని వ్యక్తిగా కనిపిస్తున్నాడని తెలియజేశారు. ఈ ఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తించిన అతని కుటుంబ సభ్యులు బంధువులు లేదా అతనికి సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే ఈ కింది ఫోన్ నెంబర్లకు (9346010561ఊట9281107077ఊ సమాచారం అందించ వలసిందిగా ఎస్ ఐ తెలియజేశారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి. శోకసంద్రంలో కుటుంబ సభ్యులు.

నంబులపూలకుంట ఆగస్టు11,అనంత సూర్య న్యూస్:నంబులపూలకుంట మండల కేంద్రంలోని రామలింగయ్య వీధిలో నివాసం ఉంటున్న గోటూరి మల్లికార్జున(42) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఇతను చాకలి వృత్తి చేసి జీవనం సాగించేవాడు. చుట్టుపక్కల గుంతలు, చెరువులలో నీరు లేకపోవడంతో కూలీ పనులకు వెళ్లేవాడు. మంగళవారం మండల పరిధిలోని వంకమద్ది గ్రామ సమీపాన ఉన్న పొలాలలో కూలి పనులకు వెళ్ళాడు. అక్కడ పనిచేస్తూ హఠాత్తుగా కుప్పకూలిపోవడంతో సహచర కూలీలు 108 వాహనం ద్వారా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హుటాహుటిన తరలించారు. పరీక్షించిన వైద్యురాలు దీప్తి మల్లికార్జున అప్పటికే మృతి చెందాడని తెలపడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య,ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు. ఇతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు నాయకులు,ప్రజలు తదితరులు కోరుతున్నారు.



# పుట్టపర్తి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సహకరించండి

**పూల శివప్రసాద్**

కొత్తచెరువు,ఆగష్టు 11, అనంత సూర్య న్యూస్:పుట్టపర్తి నియోజకవర్గం వ్యవసాయ మార్కెట్ యొక్క అభివృద్ధి పనులలో భాగంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ పూల శివప్రసాద్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శ్రీనివాస్ ని మంగళవారం గుంటూరు కార్యాలయంలో కలిసి కొత్తచెరువు వ్యవసాయ మార్కెట్లో అభివృద్ధి పనులైన రైతులకు షాప్ రూమ్స్ మరియు రోడ్డు మరియు నీటి సౌకర్యాలు నిమిత్తం అభివృద్ధి పనులకు అనుమతులు వీలైనంత త్వరగా ఇవ్వవలసిందిగా వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో భాగంగా మార్కెట్ కి కేటాయించిన నిధులు పెంచవలసిందిగా కోరారు.



# ధర్మవరం నియోజకవర్గం వాల్మీకి సంఘం నూతన అధ్యక్ష కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



ముదిగుబ్బ,ఆగస్టు 11, అనంత సూర్య న్యూస్:ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గంధ్ర గొడ్లి వెంకటనారాయణ ను ధర్మవరం నియోజకవర్గం మహర్షి వాల్మీకి బోయ సంఘం అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ మేరకు నియమాక పత్రాన్ని వెంకటనారాయణకు అందజేశారు నియోజకవర్గం అధ్యక్షునిగా ఎన్నికైన గంధ్రగొడ్లి వెంకటనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని బోయ సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలను పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ కృషి చేస్తానని వారి అభివృద్ధి కోసం పాటుపడతానని అలాగే రాష్ట్ర న్యాయకత్వం తనపై నమ్మకాన్ని ఉంచి నియోజకవర్గ పదవిని బాధ్యతలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405